క్లుప్తంగా

ఉల్లికి రూ.2500 మద్దతు ధర ఇవ్వాలి



ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఉల్లికి గిట్టుబాటు ధరగా క్వింటాలుకు రూ.2500 ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉల్లి రైతులను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా నట్టేట ముంచిందన్నారు. పండించిన పంటను కొనుగోలు చేయకుండా ఆటలాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట క్వింటాల్ ఉల్లిని రూ.1200 ప్రకారం కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. తరువాత మాట మార్చి ఎకరాకు రూ.20 వేలు పరిహారం ఇస్తామని చెప్పడం అన్యాయమన్నారు. పండిన పంట ఆధారంగా క్వింటాల్ ఉల్లికి రూ.2500 గిట్టుబాటు ధరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలతో రైతులకు దెబ్బ



మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలతో రైతన్నకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, అయినా భారత ప్రభుత్వం మాత్రం మౌనం వహించడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.నిర్మల, పీఎస్ రాధాకృష్ణ, జిల్లా నాయకులు టి.రాముడు, ఎం.రాజశేఖర్ విమర్శించారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో ట్రాంప్ విధించిన సుంకాలు-భారత్‌పై ప్రభావం అనే అంశంపై సీపీఎం ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రంపు సుంకాలతో ఆక్వా రంగం కుదేలైందన్నారు. అమెరికాలో పండిన పత్తి దిగుమతులపై ప్రభుత్వం సుంకాలను ఎత్తివేయడంతో స్థానిక రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మరోవైపు ఎక్కువ ఎగుమతులపై 100 శాతం, 50 శాతం వరకు పన్నులు విధించారని, హెచ్1బీ వీసాపై లక్ష డాలర్ల ఫీజు విధించడం దారుణమన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు: ఏపీఐఐసీ పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. భూములు ఇచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాలన్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. సమస్యలను పరిష్కరించడంలో రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఎం నాయకులు మధుసూదన్, సూర్యనారాయణ, రంగస్వామి, బుగ్గ రాముడు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి

కల్లూరు: పెద్దపాడు-ఏ. నాగలాపురం రోడ్డు అధ్వానంగా ఉందని, సీసీరోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకుడు గోపినాథ్ అన్నారు. సోమవారం పెద్దపాడులోని పలు ప్రాంతాల్లో సీపీఎం నేతలు పర్యటించారు. మూలగేరు ఉండి ఒడ్డులో వంక మీదుగా పొలాలకు వెళ్లే దారిని కొందరూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్‌లు వేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మసీదు నుంచి సచివాలయానికి వెళ్లే దారి గుంతలు పడిందని తెలిపారు. మరమ్మతులు చేయాలని కోరారు. నాయకులు పరశురాముడు, నాగరాజు, ఏసురాజు, చిరంజీవి, కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కాలనీలోని పందులను చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డు ఫారుక్ నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం నేతలు 35వ వార్డులో పర్యటించారు. ఫారుక్ నగర్‌లో రోడ్లన్ని అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేకపోవడంతో పందులు నివాసం ఉంటున్నాయని తెలిపారు. దోమలు బెడదతో పాటు వర్షం పడిందంటే రోడ్లపై నడవలేని పరిస్థితి ఉందన్నారు. సీపీఎం నాయకులు రామాంజనేయులు, సురేష్, శ్రీనివాసులు, గీత, సరోజ, పద్మ పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై పోరు



ఎస్-బ్రాండ్ కల్తీ మద్యానికి నిరసనగా ర్యాలీ చేపట్టిన వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, పార్టీ శ్రేణులు



మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న దృశ్యం

నకిలీ మద్యం తయారుచేసి వైన్ షాపుల్లో విక్రయిస్తూ ధనార్జనే ధ్యేయంగా పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, మహిళలతో కలిసి కర్నూలు డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. స్థానిక కోట్ల సర్కిల్ నుంచి డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి రెండు గంటల పాటు కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. నకిలీ మద్యాన్ని అరికట్టి సూత్రదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే కూటమి ప్రభుత్వానికి మహిళలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

బాలికల చదువుతో ఆర్థిక స్వావలంబన

కర్నూలు(హాస్పిటల్): ఆడపిల్లల చదువు వల్ల వారి ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని జిల్లా మాస్ మీడియా అధికారి ప్రకాష్‌రాజు చెప్పారు. కర్నూలు మండలం పంచలింగాల ఏపీ మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆడపిల్లలను చదివిద్దాం-కిశోర బాలికల్లో పోషకాహార లోపం అనే అంశంపై వక్తలు అవగాహన కల్పించారు. లింగ నిష్పత్తిలో అసమతుల్యత వల్ల వచ్చే నష్టాల గురించి వివరించారు. ప్రకాష్ రాజు మాట్లాడుతూ.. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వా రం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి బాలిక ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతికనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అని పిలుపునిచ్చారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, వారి మధ్య వివక్ష ఉండకూడదన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భారతి సీత, ఎంఎల్‌హెచ్‌పీ భవ్య, ఆరోగ్య కార్యకర్త షీలా, ప్రవల్లిక, ఆశా కార్యకర్త సబేరమ్మ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అటవీ శాఖ ఉద్యోగులతో సీఎఫ్ కృష్ణమూర్తి

కర్నూలు కల్చరల్: జాతీయస్థాయి క్రీడాపోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించాలని కర్నూలు సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ బీవీఏ కృష్ణమూర్తి సూచించారు. విజయవాడలో జరిగిన అటవీ శాఖ ఉద్యోగుల రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన కర్నూలు, కడప డివిజన్ల ఉద్యోగులు.. కడప డివిజన్ డీఎఫ్ఓ రాజశేఖర్ బాబు, ఆదోని ఎఫ్ఆర్‌వో పి.తేజస్వి, సీనియర్ అసిస్టెంట్ రాణా ప్రతాప్, ఎఫ్‌బీవోలు అబ్దుల్ కలాం, ప్రతాప్, వెంకటరెడ్డి, రేణుక, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్న, సుంకయ్య, కిశోర్ కుమార్, మల్లిక, గురుప్రసాద్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, షాహిన్ బాను, బీబీలకు ఆయన ఛాంబర్‌లో ఘనంగా సన్మానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు అవసరమైన అత్యాధునిక క్రీడా సామగ్రి అందజేస్తామన్నారు. జాతీయ స్థాయి పోటీలకు పది రోజుల ముందు నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. సర్కిల్ కార్యాలయం ఏఓ అబ్దుల్ సుభాన్, కర్నూలు డివిజన్ కార్యాలయం ఏఓ మహమ్మద్ హిసాన్, ఎఫ్ఎస్ఓలు కిరణ్‌కుమార్, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

కాసులిస్తే బీఈడీ కళాశాలలకు గుర్తింపు ఇస్తారా?

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ కళాశాలలకు కాసులిస్తే గుర్తింపు ఇస్తారా? అని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు ప్రశ్నించారు. సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆర్‌యూ ముఖ ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలకు ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లిన కమిటీలు కళ్లకు గంతలు కట్టుకొని రిపోర్టులు ఇచ్చాయా అని ప్రశ్నించారు. వీసీకి ఫిర్యాదు చేస్తే విచారణ చేయిస్తామని చెప్పకుండా ఆధారాలు చూపమని కోరడం దుర్మార్గమని అన్నారు. యూనివర్సిటీ అధికారులు, బీఈడీ కళాశాలల యాజమాన్యాలు కుమ్మక్కై నిబంధనలను తుంగలో తొక్కి కళాశాలలకు గుర్తింపు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. కన్వీనర్ కోటా కింద సీట్లు పొందిన వారికి అడ్మిషన్ ఇవ్వకుండా మేనేజ్‌మెంట్ కోటా కింద రూ.లక్షలకు సీట్లు అమ్ముకుంటున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా మంజూరుచేసిన 28 కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నాయకులు అఖిల్, జనార్ధన్, తేజ, అన్వర్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

కర్నూలు కల్చరల్: ఆర్‌యూ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా బీఈడీ కళాశాలలకు గుర్తింపునివ్వడంపై విచారణ చేయించాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఈడీ కళాశాలల అఫ్లియేషన్, వర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యా శాఖ స్పందించి అఫ్లియేషన్, వర్సిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దశల వారీ ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఆర్‌పీఎస్ఎఫ్ వర్సిటీ నాయకులు భూపాల్, సాయి కిరణ్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డెమోలకు పదోన్నతి

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలోని మాస్ మీడియా విభాగంలో డిప్యూటీ డెమోలుగా పనిచేస్తున్న పలువురికి హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (హెచ్‌ఈఈఓ)లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సి.ఎం.చంద్రశేఖర్ రెడ్డి, నంద్యాలలో పనిచేస్తున్న కె.రవీంద్రనాయక్ ప్రాంతీయ శిక్షణా కేంద్రం (ఫీమేల్)కు, సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఎన్.బాబాఫకృద్దీన్‌ను కర్నూలు పీఓడీటీ కార్యాలయానికి, అన్నమయ్య జిల్లాలో పి.దేవశిరోమణిని ప్రాంతీయ శిక్షణా కేంద్రం (మేల్)కు పదోన్నతిపై బదిలీ చేశారు.

అభియోగాలు నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న నేమకల్ మహేశ్వరిపై అభియోగాలు నమోదు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె 2024 ఫిబ్రవరి 22న లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించి ఏడు అభియోగాలు నమోదు చేస్తూ జీఓ ఆర్‌టీ నంబరు 876 జారీ అయ్యింది.

సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసరావు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు సబ్ రిజిస్ట్రార్‌గా వి.శ్రీనివాసరావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వరప్రసాదు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. అయితే ఆయన స్థానంలో చిట్స్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గతంలో ఆయన కల్లూరుకు కూడా కొన్నాళ్ల పాటు ఇన్‌చార్జ్ ఎస్ఆర్‌గా పనిచేశారు.

‘మోదీకి జిల్లాలో పర్యటించే అర్హత లేదు’



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చకుండా అన్యాయం చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి కర్నూలులో పర్యటించే అర్హత లేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఈనెల 15వ తేదీన చేపట్టనున్న ‘నరేంద్రమోదీ గో బ్యాక్’ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సీపీఐ నాయకులు సీఆర్ భవన్‌లో ఆవిష్కరించారు. 11 ఏళ్లపాటు దేశ ప్రజలపై జీఎస్టీ భారం మోపి..ఇప్పుడు కాస్త తగ్గించి సంబరాలు చేసుకోవడం అన్యాయమన్నారు. 15వ తేదీన వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టే మోదీ గోబ్యాక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.శ్రావణిరెడ్డి, సోమన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): ఏపీకి తీవ్ర అన్యాయం చేసిన మోదీ పర్యటనను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బి.వెంకటస్వామి పిలుపునిచ్చారు. సోమవారం గోకారి భవన్‌లో ప్రజా సంఘాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు కె.భాస్కర్, రాజు, సురేష్ నాయక్, మహేంద్ర, రమణ, రవి, తిరుపాల్, ఓబులేషు పాల్గొన్నారు.

పీఎం పర్యటనలో వైద్య బృందాల ఏర్పాటు



మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ ఉమ

కర్నూలు(హాస్పిటల్): ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన కర్నూలులో పర్యటించనున్న నేపథ్యంలో పార్కింగ్ సదుపాయాల వద్ద వైద్య బృందాలను ఏర్పాటు చేసినట్లు డీఐఓ డాక్టర్ ఉమ చెప్పారు. ఈ మేరకు వైద్య సిబ్బందికి సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి పార్కింగ్ ఏరియాలో వైద్యాధికారి, స్టాఫ్ నర్సు, సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాలతో కూడిన టీం వారికి కేటాయించిన ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి గ్యాలరీలో హెల్త్ టీమ్‌లు మెడికల్ కిట్‌తో పాటు అందుబాటులో ఉండి సభాసమావేశానికి హాజరైన సందర్శకులకు వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. వీటితో పాటు 108, 104 వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయని చెప్పారు. డీపీఓ డీబీసీఎస్ డాక్టర్ సంధ్యారెడ్డి, డీపీఓ ఎన్‌హెచ్ఎం విజయరాజు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘మోదీ గోబ్యాక్’ను విజయవంతం చేయండి

కల్లూరు: కార్మికుల హక్కులను హరించిన నరేంద్ర మోదీ గో బ్యాక్ అని సీఐటీయూ నాయకులు నరసింహులు, సాయిబాబా, కోటేష్ అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్ హమాలి అడ్డా వద్ద హమాలి కార్మికుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం, కూలీ రేట్ల పెంపు వంటి అంశాలపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. అదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా చట్టాలు చేస్తూ, కార్మికుల హక్కులను హరించడం నిరంకుశ పాలన అని అన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన 12 గంటల పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన నేతలు ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి నరేంద్ర మోదీ భజన చేయడం దుర్మార్గమన్నారు. ఈ నెల 15న ‘‘నరేంద్ర మోదీ గో బ్యాక్’’ నినాదంతో వామపక్షాల ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా పరిషత్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారని చెప్పారు. కార్మికులు, కర్షకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విశాల, డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): హృదయ శ్వాస పునరుద్ధరణ(సీపీఆర్)తో ప్రాణాలను కాపాడవచ్చని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. కేఎంసీ అనెస్తీషియా విభాగం ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో సీపీఆర్ అవగాహన వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితులలో హృదయ శ్వాస పునరుద్ధరణ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అనెస్తీషియా విభాగాధిపతి డాక్టర్ విశాల మాట్లాడుతూ.. సీపీఆర్ అవగాహన వారోత్సవాలను ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడేందుకు కృషి చేస్తానని పేర్కొంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ రామశివనాయక్, వైద్యులు, పీజీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కర్నూలు విభాగం, ఆ కాలేజీ ఎన్‌సీసీ, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. విశ్వభారతి మెడికల్ కాలేజీ ఈఎన్‌టీ విభాగం ఆచార్యులు మహేంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గుండెపోటుకు గురైన వారికి సకాలంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) చేయడం ద్వారా ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. సీపీఆర్ చేసే పద్ధతులు, ఎవరికి చేయాలి అనే అంశాలపై ప్రదర్శించారు. రెడ్‌క్రాస్ జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్‌బాబు, రెడ్‌క్రాస్ ఫ్యాకల్టీ మదన్‌మోహన్, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

కల్లూరు: జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం కలుగుతోందని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గడం వల్ల నిత్యావసర సరకుల ధరలు తగ్గి ప్రతి కుటుంబానికి సొమ్ము ఆదా అవుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పర్యటనపై అధికారులందరూ అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, జెడ్పీ పరిపాలన అధికారి మురళీమోహన్‌రెడ్డి, నాగరాజు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాల్మీకులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



వాల్మీకి విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న వీఆర్‌పీఎస్ నేతలు

- కర్నూలు సభలో ప్రధాని మోదీ ప్రకటన చేయాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2019లో కర్నూలులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో చెప్పిన విధంగా వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ హామీని నెరవేర్చాలని వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. సోమవారం వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. వాల్మీకి విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. గతంలో మోదీ కర్నూలుకు వచ్చిన సందర్భంలో వాల్మీకి/ బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 16వ తేదీన జీఎస్‌టీపై కర్నూలులో నిర్వహించే సభకు హాజరవుతున్న మోదీ వాల్మీకుల ఎస్టీ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానితో చర్చించి పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందేలా కృషి చేయాలన్నారు. వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ సాధించడమే వీఆర్‌పీఎస్ ఏకైక లక్ష్యమని, ఆ మేరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు మొలగవెల్లి రామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర, నాయకులు ఖాసీంనాయుడు, డాక్టర్ రాఘవేంద్ర, నగర అధ్యక్షుడు బోయ వెంకటనాయుడు, జిల్లా నాయకులు శివ, రాముడు, వెంకటేష్, బోయ నాగరాజు, అంజనేయులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా కృష్ణ నాయుడు

వీఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా హాలహర్వి మండలం విరుపాపురం గ్రామానికి చెందిన కృష్ణనాయుడును నియమించినట్లు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. స్థానిక మహర్షి వాల్మీకి విగ్రహం వద్ద వీఆర్‌పీఎస్ నాయకుల సమక్షంలో కృష్ణనాయుడుకు కండువా వేసి బాధ్యతలు అప్పగించారు.

కేఎంసీ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): ఈఎన్‌టీ విభాగం అసోసియేషన్ ఆఫ్ ఓటోలారింగోలజిస్ట్స్ ఆఫ్ ఇండియా(ఏఓఐ) ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో నిర్వహించిన సౌత్‌జోన్ స్థాయి సదస్సులో కర్నూలు మెడికల్ కాలేజీ ఈఎన్‌టీ విభాగం పీజీ తృతీయ సంవత్సరం విద్యార్థిని డాక్టర్ దివ్య నాగేశ్వరి ప్రతిభ చాటారు. క్విజ్ విభాగంలో ఆమె గోల్డ్‌మెడల్ సాధించగా టెంపోరల్ బోన్ డిసెక్షన్‌లో డాక్టర్ షేక్ షాజియా జబీన్ సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సోమవారం తన ఛాంబర్‌లో అభినందించారు. ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లింగన్న, ఎస్ఆర్ డాక్టర్ ప్రేసి షరాన్ పాల్గొన్నారు.

డాక్టర్ జయప్రకాష్‌రెడ్డికి బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డికి బంగారు పతకం లభించింది. ఈ నెల 10, 11, 12వ తేదీల్లో విజయవాడలో జరిగిన దక్షిణ భారత, రాష్ట్రస్థాయి ఈఎన్‌టీ డాక్టర్ల సదస్సులో ఆయనకు ఈ పతకం అందించారు. చెవిలో చీము కారే రోగులకు అత్యాధునిక పద్ధతుల ద్వారా ఆపరేషన్ చేయడం ఎలా, తద్వారా చీము రాకుండా వినికిడి పెంపొందించడం ఎలా అనే అంశాలపై ఆయన చేసిన ఆవిష్కరణలకు ఈ పురస్కారం లభించింది. జరిగిన ఈఎన్‌టీ వైద్యుల ఎన్నికల్లో డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు.

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



సాధించిన పతకాలతో డాక్టర్ చందన రాజారామ్, మంజులాదేవి

కర్నూలు(హాస్పిటల్): మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కర్నూలు మెడికల్ కాలేజీ అనెస్తీషియా విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చందన రాజారామ్ ప్రతిభ కనపరిచారు. ఈ పోటీలో ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రీస్ట్ స్ట్రోక్‌లో గోల్డ్ మెడల్, రెండు సిల్వర్ మెడల్స్, ఒక కాంస్యం సాధించారు. ఆమెకు హైకోర్టు చీఫ్ జస్టిస్ చేతుల మీదుగా పతకాలు అందించారు. ఆమెను కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సోమవారం తన ఛాంబర్‌లో అభినందించారు.

స్టాఫ్‌నర్సుకు ద్వితీయ స్థానం

ఈ పోటీల్లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్న డి.మంజులాదేవి రెండు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్, ఒక కాంస్య మెడల్ సాధించారు. అలాగే 11, 12వ తేదీల్లో షంషేర్‌ఖాన్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన పోటీలో డాక్టర్ చందన రాజారామ్ నాలుగు బంగారు పతకాలు, మంజులాదేవి ఒక బంగారు పతకం, మూడు సిల్వర్, 3 కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే జీఎస్టీ సంబరాలు

కర్నూలు(సెంట్రల్): ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్లుగా ప్రజలపై జీఎస్టీ భారం వేసి నయవంచన చేశారని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగమధుయాదవ్ విమర్శించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం బీహార్ ఎన్నికల కోసమే జీఎస్టీ తగ్గింపు అంటూ హడావుడి చేస్తున్నారని ఆరోపించారు. 11 ఏళ్లపాటు జీఎస్టీ పేరుతో 140 కోట్ల మంది ప్రజలపై రుణభారం మోపిన మోదీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మరోవైపు జీఎస్టీతో రాష్ట్రానికి ఏటా రూ.8 లక్షల కోట్ల ఆదాయం తగ్గిందన్న చంద్రబాబు ప్రస్తుతం మోదీతో కలిసి ఉత్సవాల్లో పాల్గొనడం దారుణమన్నారు. 11 ఏళ్ల నష్టాన్ని తిరిగివ్వాలని చంద్రబాబు మోదీని కోరాలన్నారు. లేదంటే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన వారవుతారన్నారు. గతంలో బీజేపీ రాయలసీమ డిక్లరేషన్ అంటూ హడావుడి చేసినా ఎలాంటి ఫలితం దక్కలేదన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, కడప స్టీలు ప్లాంటు, వైజాగ్ స్టీలు ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీని ఇస్తామని తిరుపతి వెంకటేశ్వరస్వామి సాక్షిగా చెప్పిన మోదీ, చంద్రబాబు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కేంద్రం నిధులను విడుదల చేయాలన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకే జీఎస్టీ తగ్గింపు సంబరాలు అంటూ హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు శ్రీనిథ్ రాయల్, శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.